క్లుప్తంగా

13న ఎస్ఐ నమూనా పరీక్ష

కడప వైఎస్సార్ సర్కిల్: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న ఎస్ఐ నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని వెంకటసాయి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని వెంకట సాయి కోచింగ్ సెంటర్‌లో ఎస్ఐ నమూనా పరీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు దస్తగిరి, సురేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల మహిళా చైర్ పర్సన్‌గా భారతి



భారతిని అభినందిస్తున్న మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రొద్దుటూరు డివిజన్ మహిళా చైర్ పర్సన్‌గా తిరువీధుల భారతి నియమితులయ్యారు. బుధవారం కడప ప్రకాష్‌నగర్‌లో ఉన్న హెచ్ఆర్‌సీసీఐ కార్యాలయంలో ఆమెకు నేషనల్ చైర్మన్ సింగమాల వెంకట రమణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. సంస్థ నాయకులు ఎస్వీ రమణయ్య, డి.శ్యామ్, ప్రవీణ్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అగ్నిమాపక ప్రమాదాల నివారణపై మెలకువలను నేర్పిస్తున్న అధికారి వెంకటసుబ్బయ్య

కడప అర్బన్ : అగ్నిప్రమాదాల నియంత్రణపై ప్రతి ఉద్యోగి, అధికారులు అవగాహన కలిగి ఉండాలని కడప ఫైర్ స్టేషన్ సహాయ అధికారి వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. మంగళవారం కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆపదమిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వంటింటిలో మహిళలు గ్యాస్ సిలిండర్‌ను ఉపయోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన ద్వారా మెలకువలను నేర్పించారు.

ఉత్సవాల ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ తెలిపారు. బుధవారం పొలతల క్షేత్రంలో చేపడుతున్న ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కించి రూ.1,06,263లు వచ్చినట్లు తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, దాతలు పుల్లయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్: వాహనదారులు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కడప ఒన్‌టౌన్ ఎస్ఐ పెద్ద ఓబన్న అన్నారు. మంగళవారం సాయంత్రం కడప ఒన్‌టౌన్ పీఎస్ పరిధిలో ఎర్రముక్కపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు. వాహనాల రికార్డులు తప్పనిసరిగా వెంట ఉండాలని.. లేకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

1న జీతాలు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా కోరారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన చెన్నూరు మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతంపై ఆధారపడ్డ ఉద్యోగ ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

రామాంజనేయపురంలో పూర్తయిన రోడ్డు నిర్మాణాలు



పీఎఫ్ క్వార్టర్స్ పక్కన ఇటీవల నిర్మించిన సిమెంటు రోడ్డు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో శివారు ప్రాంతాలపై నగరపాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించింది. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు సూచనల మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఈ ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు రామాంజనేయపురం పరిధిలోని ఆచారి కాలనీలో పీఎఫ్ క్వార్టర్స్ పక్కన పది రోజుల క్రితమే సిమెంటు రోడ్డు పూర్తి చేశారు. చుట్టూ ఆక్రమణలతో బురదమయంగా ఉండే ఈ రోడ్డు ప్రస్తుతం విశాలంగా సీసీ రోడ్డుగా రూపాంతరం చెందడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ కూడా వారం రోజుల్లోనే మొదలు పెట్టి నిర్మాణం పూర్తి చేయడం పట్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే కాలనీలో అంతర్గతంగా ఉన్న రోడ్లలో గ్రావెల్ రోడ్లు పూర్తి వేశారు. అలాగే వరద కాలనీ నుంచి జర్నలిస్టు కాలనీ వరకూ ఏడాదిన్నర క్రితమే గ్రావెల్ రోడ్డు మంజూరు కాగా ప్రస్తుత కమిషనర్ దాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇలా ఒక్కొక్కటిగా నాలుగైదు గ్రావెల్ రోడ్లు, ఒక సిమెంటు రోడ్డు ఈ ప్రాంతంలో నిర్మించారు. అలాగే మద్రాసు రోడ్డు నుంచి ఎలక్ట్రికల్ కాలనీ మీదుగా గురుకుల ఉర్దూ స్కూల్ వరకూ ఉన్న రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వారం, పదిరోజుల్లో ఈ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లను ఇప్పుడు అభివృద్ధి చేస్తుండటంపై స్థానిక ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

చిన్నారులూ.. శభాష్!

హిందూ ధార్మిక పోటీల్లో ముస్లిం చిన్నారుల ప్రతిభ



ధార్మిక పోటీల్లో ప్రతిభ చాటిన నజీముల్ అమీన్ పాఠశాల విద్యార్థులు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయ 23వ వార్షికోత్సవాల్లో కడప నగరానికి చెందిన నజీముల్ పబ్లిక్ స్కూలు చిన్నారులు ధార్మిక క్విజ్‌పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. హిందూ పురాణాలు, ఇతిహాసాలు తదితర అంశాలపై దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ పోటీలో ఆది నుంచి ఈ చిన్నారుల బృందం తమ ప్రతిభను చాటుకుంటూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పురాణ, ఇతిహాసాలలో తాము ఏమాత్రం తీసిపోమని చాటారు. వార్షికోత్సవాల్లో భాగంగా తొలిరోజు జరిగిన క్విజ్ పోటీలలో 12 బృందాలు పాల్గొనగా, నజీముల్ అమీన్ స్కూలుకు చెందిన అఫ్సర్ బృందం ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో సాయికృష్ణ హైస్కూలుకు చెందిన లహరి బృందం, తృతీయ స్థానంలో ఏపీ ట్రైబల్ ఉమెన్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలుకు చెందిన చందన బృందం నిలువగా బాల వికాస్ స్కూలుకు చెందిన టి.ప్రదీప్‌కుమార్ బృందం ప్రోత్సాహక బహుమతి సాధించారు. రెండవ విభాగంలో జరిగిన ధారణ పోటీలో ట్రైబల్ వెల్ఫేర్ ఉమెన్స్ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులు టి.పవిత్ర ప్రథమ స్థానం, అదే పాఠశాలకు చెందిన రాజేశ్వరి, భాష్యం స్కూలుకు చెందిన మేఘన ద్వితీయ బహుమతి, సాయికృష్ణ హైస్కూలుకు చెందిన సాయిశ్రీత, లహరి, శివ గణేష్ తదితరులు తృతీయ బహుమతి సాధించారు.

నేటి పోటీలు

ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు గురువారం ఉదయం 9 గంటలకు స్త్రీ, పురుషులకు ధార్మిక క్విజ్ పోటీ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మహిళలకు రంగవల్లి పోటీలు నిర్వహిస్తారు. రాత్రి సినీ భక్తిగీతాల పోటీ ఉంటుందని వివరించారు.

అధునాతన స్కిన్ క్లినిక్ ప్రారంభం



గురిజాల స్కిన్ క్లినిక్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కడప రూరల్ : కడప నగరం మురళీ థియేటర్ ఎదురుగా బుధవారం ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణులు జి. పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన గురిజాల స్కిన్ క్లినిక్‌ను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో స్కిన్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆసుపత్రిలో లభించే వైద్య సేవలను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వాసులకు చర్మ, లెప్రసీ, సుఖ వ్యాధులు, హెయిర్ లేజర్‌కు సంబంధించి అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే సంకల్పంతోనే నగరంలో ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ సలహాదారులు రాజోలు వీరారెడ్డి, జడ్పీటీసీ నరేన్‌రామాంజులరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, వైద్యులు విష్ణుప్రియ, పావని, మహీధర్‌రెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ అమలు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో భూమి లేని పేదలకు భూ పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో పేదలకు భూ పంపిణీ అమలు చేయాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు విస్తారంగా ఉన్నాయని వాటిని ధనవంతులు, పలుకుబడి ఉన్నవారికి అన్యాక్రాంతం అయ్యాయన్నారు. ప్రభుత్వం అన్యాక్రాంతం అయిన వాటిని వెంటనే స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలన్నారు. జిల్లాలో హైవే రోడ్లు గ్రీన్ ఫీల్డ్ రోడ్లకు రైతుల వద్ద నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారని తెలిపారు. వారందరికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్వేష్, నరసయ్య, గోవిందు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలికి

వినతుల వెల్లువ



జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలిని కలిసిన బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదిని బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డి కలిశారు. మైనార్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రమిచ్చారు. ఈ కార్యక్రమములో బీజేపి నాయకులు లక్ష్మణరావు, బాలకృష్ణయాదవ్, ప్రభుకుమార్,కృష్ణారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి,సమీరా, పద్మాబాయ్, శోభాబాయ్, దుర్గం దస్తగిరి,గవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కడప రూరల్ : కడప ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదిని వివిధ మైనార్టీ సంఘాలకు చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రాలను సమర్పించారు. సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మైనార్టీల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి వక్ఫ్ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, బిషప్ డాక్టర్ కే సామ్యూల్‌బాబు పేర్కొన్నారు.

రాజీవ్ మార్గ్‌లో మొక్కలు నాటాలి



రాజీవ్ మార్గ్ పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రాజీవ్‌మార్గ్‌లో డివైడర్లలో మొక్కలు నాటి లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ సూచించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా మాసాపేట రోడ్డు, డ్రైన్ పనులను, రాజీవ్ మార్గ్‌లో రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాసాపేటలో రోడ్డుకు ఇరువైపులా లెవెల్స్ ఆధారంగా కాలువ, రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. రాజీవ్ పార్కులో లైటింగ్ వర్క్స్, టాయ్‌లెట్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు పాఠాలను సులభంగా గుర్తుంచుకునేలా బోధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల పరీక్షల విభాగానికి సహాయ అధికారులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల పరీక్షల విభాగానికి సహాయ అధికారులుగా ఇద్దరు అధ్యాపకులను నియమిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఉదయం సహాయ అధికారులుగా డాక్టర్ జి. రామకృష్ణ (జియాలజీ), మనోహర్‌రెడ్డి (కంప్యూటర్ సైన్స్) బాధ్యతలు చేపట్టారు. వీరిని ప్రభుత్వ కళాశాలల టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ నీలయ్య, జోనల్ అధ్యక్షుడు డా.కృష్ణారెడ్డి అభినందించారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

వల్లూరు : కంది పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఏ వీరయ్య అన్నారు. వల్లూరు మండలంలోని తోల్లగంగనపల్లెలో సుబ్బారెడ్డి అనే రైతు పొలంలో జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శన ద్వారా కందిలో ఎల్ఆర్‌జీ 105 విత్తన రకంతో బాటు కీలక ఉపకరణాలు సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాలను, సలహాలను ఇవ్వడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించారన్నారు. అనంతరం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు కొర్ర లడ్డూలు, చిరు ధాన్యాల సాగు కర పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్వామి చైతన్య, టీ మహేష్‌బాబు, టి.మురళీకృష్ణ, ఎస్.రామలక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించండి

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజా ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకాంపల్లి పంచాయతీ పరిధిలోని వేపమానుసత్రం, కాంపల్లి గ్రామాల్లో వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ అలాగే వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రతి లబ్ధిదారుడిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు చౌకబారు మాటలు మాట్లాడుతూ కాలం వెల్లబుచ్చుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్న చేసిన సంక్షేమ పథకాలను చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో–కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు మల్లికార్జున యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, యూత్ అధ్యక్షుడు గజ్జల ఈశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి, నాయకులు గూడ రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని మద్దిమడుగు గ్రామంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కల్యాణ వైభోగమే..

- ఘనంగా శ్రీవేంకటరమణుడి కల్యాణం
- ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సతీసమేత శ్రీకల్యాణ వేంకటరమణుడు



స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్త సందోహం

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డున వెలసిన శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటరమణుడి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం నాటితో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయంలో చలువ పందిళ్లు, పచ్చని తోరణాలు, వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటరమణ స్వామి కల్యాణం భక్తకోటి పులకించేలా అంగరంగ వైభవంగా జరిగింది. సుగంధ దివ్యపరిమళ పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా కంకణ ధారణ, అగ్రిహోత్రం, యజ్ఞోపవేతం గావించి అనంతరం మహామంగళ సూత్రాలకు పూజలు చేసి భక్తులకు చూపిస్తూ స్వామి వారికి అందించి అమ్మవార్ల మెడలో మాంగళ్యధారణ చేశారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పులకించారు. గోవిందా నామస్మరణలతో ఆలయం మారుమ్రోగింది. కల్యాణనంతరం ఉభయదారులకు కండువాలతో సత్కరించి స్వామివారి ఆశీర్వాదాలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులతో ఆలయం నిండుగా దర్శనమిచ్చింది.

కొలువై ఉన్నాడు.. కోదండ రాముడు

- ఆలయం.. ప్రగతి పథం
- భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న స్వామి



ఏఎస్ఆర్ నగర్‌లోని శ్రీ కోదండ రామాలయం

కడప కల్చరల్ : భక్తుల ఆరాధన ఆయనకు ఆలయాన్ని సంతరించి పెట్టింది. వారి భక్తి దేవాలయాన్ని దినదినాభివృద్ధి దిశగా తీసుకు వెళుతోంది. కడప నగరం 48వ డివిజన్‌లోని ఏఎస్ఆర్ నగర్‌లో శ్రీ కోదండ రామాలయం వెలసింది. 1996లో 4.50 సెంట్ల విస్తీర్ణంలో ఆలయం, ప్రాంగణం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రోజూ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోరిన కోరికలు నెరవేరుతుండడంతో ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నవదంపతులు తమ కాలనీల్లోకి ప్రవేశించేటప్పుడు అక్కడ పూజ కార్యక్రమాలు నిర్వహించడం ఆచారంగా వస్తోంది.

వైభవంగా ఉత్సవాలు

ఆలయంలో ఏటా శ్రీరామనవమి, రథసప్తమి, శ్రావణమాసం, వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

కమిటీ ఏర్పాటు

స్థానికులు 2022లో కమిటీ ఏర్పాటు చేసుకుని, ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించారు. ప్రతి శనివారం సమావేశం నిర్వహించి, కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. ఇప్పటి వరకు రూ.2.50 లక్షలతో ప్రగతి పనులు చేపట్టారు. ప్రాంగణంలో బండపరుపు(చప్పట) వేయించారు. రక్షణగోడ, మూత్రశాల, మరుగుదొడ్లు నిర్మించారు. ఇంకా మరికొన్ని పనులు చేపట్టాల్సి ఉందని కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ కాలనీల్లో పేదలు ఎక్కువగా నివసిస్తున్నారు. రాజకీయ నాయకులు, అధికారులు, దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

కమలాపురం : కడప కలెక్టరేట్ వద్ద ఈనెల 13వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసుల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వీఆర్ఏల రోజువారి పనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన ముఖ హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరారు. వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, యూనియన్ కార్యదర్శి రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

కమలాపురం : పట్టణ పరిధిలోని అప్పాయపల్లెలో వెలసిన ఎయిమ్ ఫర్ సేవ (ఛాత్రాలయం) విద్యార్థులకు ఎన్ఆర్ఐ బసవరాజు కిరణ్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన స్నేహితులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, మహ్మద్ రఫీ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.